క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకునాయుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రేగిడి: విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పనసలవలసకు చెందిన ఇజ్జాడ వెంకునాయుడుకు వలంటీర్ సంధ్య శుక్రవారం పింఛన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ నగదు అందజేయడం పట్ల వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇంతటి గొప్ప వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

మున్సిపల్ చైర్మన్ పరిశీలన



తాగునీటి పైపులైన్ల మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న తాగునీటి పైపులైన్ల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. లీకులను అరికట్టి, పట్టణ ప్రజలను సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి స్థితిగతులపై ఇన్‌చార్జ్ డీఈఈ సురేష్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, సవలాపురపు బాబు, ఇంటి గోవిందరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి



విద్యార్థినులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో కిశోరి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ పీవో జె.శిమ్మాలమ్మ శుక్రవారం అవగాహన కల్పించారు. కౌమారవిద్యలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కిశోరి బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఒత్తిడికి గురికాకూడదన్నారు. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.శైలజ, రాణీరత్నం, జయలక్ష్మి, ముత్యాలరత్నం తదితరులు పాల్గొన్నారు.

70 శాతం పన్నులు వసూలు



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డీడీ నాగరాజు

బొబ్బిలి: జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్, రీజియన్‌లోని 16 మున్సిపాలిటీల్లో ఈ ఏడాది ఇప్పటివరకు 70.98 శాతం పన్నులు వసూలు చేశామని మున్సిపల్ ఆర్‌డీడీ జి.నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును సందర్శించి, చెత్త నుంచి ఎరువులు తయారు చేయడాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీజియన్‌లోని 16 మున్సిపాలిటీల్లో 7,68,510 ఇళ్ల నుంచి రూ.76.85 కోట్ల పన్నుల వసూలును లక్ష్యంగా పెట్టుకున్నామని, రూ.55.25 కోట్ల పన్నులు వసూలు చేశామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు కొంపంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

మెంటాడ: మండలంలోని కొంపంగి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమ్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందితో పాటు సచివాలయాల ఆరోగ్య సిబ్బంది కూడా శిబిరానికి హాజరుకావాలని, రోగులు ఈ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంతకవిటిలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆ ప్రాంత ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్రం బాగుండాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నదే సీఎం జగనన్న తపన అని, ఆయన అన్ని వర్గాల బాగు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరెన్నో సంస్కరణలు చేపడుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు చేరవేస్తున్న ఘనత ఆయనదేనన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలను జగనన్న సర్కారు అమలు చేయడం జరిగిందన్నారు. వైద్యం నిమిత్తం చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ వస్తే దానిని ఓ సంబరంలా టీడీపీ నేతలు భావించి, హడావిడి చేయడం చూసి, జనం నవ్వుకుంటున్నారన్నారు. కోర్టు మానవతా దృక్పథంతో నేత్ర శస్త్రచికిత్స చేయించుకునేందుకు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటనే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారం దక్కించుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, మాజీ సర్పంచ్ గురాల జగన్మోహనరావు, ఎంపీటీసీ పి.శంఖరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మెట్టవలస గ్రామస్తులు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన వినాయక ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గణేశునికి పూజలు చేసి, రాష్ట్ర ప్రజలంతా బాగుండాలని వేడుకున్నారు. అనంతరం తన ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను ఆలయ నిర్మాత పువ్వల శాస్త్రి(వెంకటరమణ), గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, సర్పంచ్ పువ్వల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ఆర్‌టీవో హేమసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేసుకుంటే ఆరోగ్యవంతమైన పంట చేతికిరావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం కూరగాయల సాగులో అనంతపురం(ఏటీఎం) మోడల్‌ను అన్నదాతలకు తెలిపారు.

26న చిత్రలేఖన పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో రామాయణం సన్నివేశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నామని వికాస తరంగిణి సమన్వయకర్త అమనాన నీలకంఠం తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జరగనున్న పోటీలకు సంబంధించి, రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్రాథమిక స్థాయిలో జరిగే పోటీలకు 5, 6, 7వ తరగతి విద్యార్థులు, ఉన్నత స్థాయిలో జరిగే పోటీలకు 8, 9, 10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. విశ్వామిత్రుడు, శ్రీరాముడు, లక్ష్మణుడు, సుబాహువు, మారీచుడు చిత్రాలు ప్రధానంగా వేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8897362962, 8500889795ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కొత్తా రమేష్, పొదిలాపు కృష్ణ, మామిడి భారతి, గెద్దాపు శ్రీలక్ష్మి, వీవీ పైడిరాజు, ఎం.గణేష్, గడే అప్పలనాయుడు, గట్టి పాపారావు, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించడమే లక్ష్యం



ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

వంగర: ఉపాధిహామీ వేతనదారులకు 100 రోజుల పాటు పని కల్పించడమే లక్ష్యమని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఈఎస్ ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమావేశమైన ఆయన గ్రామాల్లో 60 పనిదినాలు పైబడి పూర్తి చేసిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని సూచించారు. ఇప్పటికే హౌసింగ్, ఉద్యాన పంటలు, చిన్నకాలువలు, ఎవెన్యూ ప్లాంటేషన్ వంటి పనుల్లో వేతన దారులు పనులు చేస్తున్నారని, ఖరీఫ్ పనులు అనంతరం శతశాతం పనులు కల్పిస్తామన్నారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో పనులు చేసేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, పనులు ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం మర్రాపు సత్యవతి, ఈసీ అధికారి హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మంచి ఫలసాయం



బీజామృతం తయారీ, విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: రబీ సీజన్‌లో సాగుచేసే పంటలకు సంబంధించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తనాలను శుద్ధి చేసుకుంటే మంచి ఫలసాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొద్దాం, బొమ్మినాయుడువలస గ్రామాల్లో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, ఆవుమూత్రంతో తయారుచేసుకున్న బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయాలని, ఇలా చేయడం ద్వారా విత్తనాలకు అంతగా తెగులు, చీడపీడలు సోకవన్నారు. విత్తన మొలకశాతం కూడా పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బొద్దాం సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, ఐసీఆర్‌పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మండల కేంద్రంలో ఈ నెల 8వ తేదీన కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి, అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, శాఖల వారీగా ప్రగతి నివేదికలతో పాటు గతంలో మండలంలో జరిగిన స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యల్లో ఎన్నింటిని పరిష్కరించారన్న విషయాన్ని కూడా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. స్పందన కార్యక్రమంపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు తెలిపారు. సమావేశంలో తహసీల్దారు బి.రత్నకుమార్, ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

బాడంగి: జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవో ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ సత్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆమె మండలంలో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి..

ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.. ఇంకెన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావాల్సి ఉందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. నిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న మెటీరియల్, ఆర్థికసాయం, రుణం వంటి సదుపాయాలను వివరించాలన్నారు. 1037 ఇళ్లు, 121 వ్యక్తిగత మరుగుదొడ్లు, 19 ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తయినట్లు ఏఈ తెలిపారు. వచ్చే వారానికి 71 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో హెల్త్ మ్యాపింగ్

- ఎమ్మెల్యే కంబాల జోగులు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం: గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా హెల్త్ మ్యాపింగ్ జరిగిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని ముద్దాడజోగివలస గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించిన ఆయన ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా ప్రతీ గ్రామంలో, పట్టణంలోని ప్రతీ వార్డులో క్షేత్రస్థాయిలో ఇంటింట ఆరోగ్య సర్వే నిర్వహించడంతో పాటు స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. రాజాం నియోజకవర్గంలో 122 పంచాయతీల్లో, పట్టణంలోని 24 వార్డుల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. వేలాది మందికి ఉచితంగా ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు మందులు కూడా అందించడం జరిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపించే నాయకుడు మన సీఎం జగనన్న అన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్‌లు వాకముల్ల చిన్నంనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, వైద్యుడు నరేంద్ర, ఎంపీడీవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే



వన్నలిలో సర్వే వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దారు సుదర్శనరావు

రేగిడి: పక్కాగా భూముల రీసర్వే నిర్వహించడం జరుగుతోందని, సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని తహసీల్దారు సుదర్శనరావు కోరారు. మండలంలోని వన్నలి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను శుక్రవారం పరిశీలించిన ఆయన ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయని, భూ యజమానులకు కూడా తమ భూములపై సర్వహక్కులు ఉండేలా ఓ హక్కుపత్రం ఇవ్వడం జరుగుతోందన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో భూముల రీసర్వే జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, వీఆర్‌వో భారతి, సన్నిందొర, సర్వేయరు శ్రీనివాసరావు, సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్



రాజాం సిటీ: బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రాజు

రాజాం సిటీ: మండలంలోని 82 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ నెల 4, 5వ తేదీల్లో ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎస్.కె.రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు ఉండేలా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ బి.ప్రకాష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఓటుహక్కు నమోదుకు శని, ఆదివారం నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు అజురఫీజాన్ కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 51 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఈ కార్యక్రమం నిర్వహించి, 18 ఏళ్లు నిండిన యువతీయువకులతో ఓటుహక్కు నమోదుకు దరఖాస్తులు చేయిస్తారని, అలాగే ముసాయిదా ఓటరు జాబితాలో ఓటరు తప్పొప్పులు సవరించడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో శని, ఆదివారం ఓటుహక్కు నమోదుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దారు రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఓటరుగా నమోదు కావాలనుకునే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర నిర్ణయించుకునే అధికారం రైతులకు కల్పించాలి

బాడంగి: తాము పండించిన ఉత్పత్తులకు ధరలు నిర్ణయించుకునే అధికారం తమకే కల్పించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని భీమవరం గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల తరఫున సర్పంచ్ ప్రతినిధి చప్ప తిరుపతినాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో గుండుసూదుల తయారీ దగ్గర నుంచి పెద్దపెద్ద పనిముట్ల వరకు తయారీదారులకే ధరలు నిర్ణయించుకునే అధికారం ఉందని, రైతులకు మాత్రం ఆ అధికారం లేదన్నారు. రిటైర్డ్ ఇంజినీర్ లచ్చుపతుల చిన్నంనాయుడు మాట్లాడుతూ వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఎంతగానో నష్టపోతున్నారని, ఆ సమయంలో వారికి కనీస పెట్టుబడి సొమ్మునైనా ఇప్పించేలా ప్రభుత్వానికి అధికారులు సిఫార్సులు చేయాలని కోరారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సిద్ధమవుతున్న సమయంలో ధరల నిర్ణయంలో అధికారంపై స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ధాన్యం కొనుగోళ్లు చేసేటప్పుడు ఎదురైన ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏవో శిరీష తెలిపారు. మొదటి రకం ధాన్యం క్వింటా రూ.2,203 గాను, రెండో రకం ధాన్యం క్వింటా రూ.2,183గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇది గతేడాది కన్నా రూ.143 ఎక్కువగా చెల్లిస్తున్నట్లు చెప్పారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



బొద్దూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని బొద్దూరులో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాధ్యమవుతోందన్నారు. ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయంటే దానికి కారణం సచివాలయ వ్యవస్థేనన్నారు. గతంలో జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలన్నా మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామంలోని సచివాలయంలోనే ఆయా ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతోందన్నారు. సచివాలయాల సేవలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సర్పంచ్ గేదెల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తున్న బాడంగి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-3లో లబ్ధిదారులకు టీహెచ్‌ఆర్(టేక్ హోమ్ రేషన్/పౌష్టికాహారం) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనల ప్రకారం వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత వ్యాధి రాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు, బాలామృతంతో చేసిన ఆహార పదార్థాలను ప్రతిరోజూ తినాలని సూచించారు. పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో తెర్లాం-3, 5 అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటల పరిశీలన



రాజయ్యపేటలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

రాజాం సిటీ: మండలంలోని రాజయ్యపేట, బొమ్మినాయుడువలస గ్రామాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు శుక్రవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని సామంతుల అప్పలనాయుడు, ముదిలి జనార్దనరావు, రౌతు రామచంద్రరావుతో పాటు మరికొంతమంది రైతులకు చెందిన 50 ఎకరాల్లోని పంట ఎండిపోయినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వమే తమను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని వారంతా ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు సంబంధించిన పొలాలను పరిశీలిస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఎవరు ఎంతమేర పంటలు నష్టపోయారన్న దానిని గుర్తించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏడీ కె.చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు ఉన్నారు.